ముళ్లపొదలతో ముప్పు




పినిరెడ్డిగూడెం నుంచి బాలాజీ తండాకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

- మూలమలుపుల వద్ద ప్రమాదాలు
- తొలగించాలని స్థానికుల డిమాండ్

గార్ల : దట్టంగా అల్లుకున్న ముళ్లపొదలతో పెనుముప్పు వాటిళ్లనుంది. అనుకోని ప్రమాదం సంభవించక ముందే ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించి ప్రయాణికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.. మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామం నుంచి బాలాజీ తండా వయా ఇల్లెందుకు వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా దట్టంగా ముళ్లపొదలు అల్లుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. ముళ్లపొదలతో పాటు మలుపులు ఉండడంతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధత అధికారులు వెంటనే ముళ్లపొదలను తొలగించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గార్ల నుంచి ఇల్లెందు వెళ్లేందుకు ఈ రహదారితో దూరం తగ్గుతుందని వాహనదారులు అధిక సంఖ్యలో వెళ్తుంటారు. ఈ రోడ్డులో వాహనాలు, ద్విచక్రవాహనాలపై వెళ్తు మూలమలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఢీకొని ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్లపొదలను తొలగించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదాలను నివారించాలి



నిత్యావసరాల కోసం బాలాజీతండా నుంచి మండల కేంద్రమైన గార్లకు వెళ్తాం. ఈ రహదారిలో మలుపుల వద్ద ముళ్లపొదలు అల్లుకుపోయి ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొన్న ఘటనలో చాలా మందికి తీవ్రగాయాలయ్యాయి. గతేడాది ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలి.

\- ఆర్.శంకర్ బాలాజీతండా

నాణ్యమైన విద్యుత్ అందించాలి

- వరంగల్ చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న రాజుచౌహాన్

నెహ్రూసెంటర్: వేసవి దృష్ట్యా వినియోగదారులకు అవసరం మేరకు నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్‌శాఖ వరంగల్ చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈ కార్యాలయంలో అధిక లోడు, విద్యుత్ బకాయిలు, ట్రాన్స్‌ఫార్మర్లపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగం పెరిగితే ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచాలని, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ జె.నరేష్, డీఈ పెద్దిరాజు, విజయ్, ఏడీఈలు, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

'నెరవేరిన ఎస్సీల ఆకాంక్ష'

మహబూబాబాద్ రూరల్ : మాదిగల ముప్పై ఏళ్ల ఆకాంక్ష నెరవేరిందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజినీకాంత్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ గురువారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి, బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురుగు రంగన్న, నాయకులు ఏకుల రవీందర్, పడిశాల వెంకన్న, సిరిపురం వీరన్న, మీసాల సురేష్, పుచ్చకాయల మధు, నమిల ప్రసాద్, గుంజ హనుమంతు, నరేష్, శ్రీను, దుడ్డెల సుభాష్, దళపతి, అజయ్, కోడూరి అనిల్, అనిల్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రజనీకాంత్ తదితరులు

క్షీరాభిషేకం

డోర్నకల్ : బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా గాంధీసెంటర్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మాదా శ్రీనివాస్, వాంకుడోత్ వీరన్న, కేశబోయిన కోటిలింగం, కాసం శేఖర్, నానియాదవ్, ఎల్లావుల హరికృష్ణ, రెడ్డెబోయిన శంకర్ తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

చర్య తీసుకోవాలి



తొర్రూరు : పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన ఘటనలో బాధ్యులపై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. గురువారం డివిజన్ కేంద్రంలో నిర్వహించిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో దేవేందర్ మాట్లాడారు. పాఠశాల విద్యార్థి సిద్ధార్థకు అధిక డోసు ఇంజక్షన్ ఇవ్వడం వల్లే ప్రాణాలు కోల్పోయాడన్నారు. ఘటనకు కారణమైన ఆస్పత్రిని సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దు, వినేష్, ప్రకాశ్, కృష్ణ, ప్రమోద్, వంశీ, అభిలాష్ పాల్గొన్నారు.

'దళితుల విచ్ఛిన్న కుట్రలను తిప్పికొట్టాలి'



తొర్రూరు : దళితుల విచ్ఛిన్న కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని మాల మహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ అన్నారు. గురువారం పట్టణంలో మాలమహానాడు సంఘ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టిమళ్ల మహేష్‌తో కలిసి భాస్కర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని, ఎస్సీ రిజర్వేషన్ల పెంపునకు ప్రభుత్వం పాటుపడాలన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వర్గీకరణ చేపట్టవద్దని, దళితులను విభజించే కుట్రలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యనమల రాకేష్, కారం ప్రశాంత్, చిట్టిమళ్ల కిరణ్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

వైద్యశిబిరం



దంతాలపల్లి : మండలంలోని రామానుజపురంలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో బోదకాలు వ్యాధి గ్రస్తులను గుర్తించామని పెద్దముప్పారం పల్లె దవాఖాన వైద్యులు వాణి అన్నారు. వైద్యశిబిరంలో 50మందికి పరీక్షలు నిర్వహించామని, రోగులు చెప్పిన లక్షణాలను బట్టి పరీక్షలు నిర్వహించగా వారికి బోదకాలు నిర్ధారణ అయిందన్నారు.

దుస్తులు అందించాలి



కేసముద్రం : వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీ, కూలీ, దడువాయి, బండ్ల కార్మికులకు దుస్తులు అందించాలని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావుకు, తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య రాము మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు మిట్టగడుపుల వెంకన్న, వీరయ్య, శోభన్, రాజు, వెంకన్న, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి రక్షించాలి



మహబూబాబాద్ అర్బన్ : మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని కేంద్రీయ విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ముఖేష్ అన్నారు. గురువారం హరిత మహోత్సవం సందర్భంగా విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీతిష్ కుమార్, ఇమాముద్దీన్ మహమ్మద్, దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసు నమోదు

డోర్నకల్ : భార్య, కుమారుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ గురువారం తెలిపారు. పెరుమాళ్లసంకీసకు చెందిన నీరుడి మహేష్, శిరీషకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో ఐదు రోజుల క్రితం శిరీష తల్లి వద్దకు వెళ్లింది. తల్లిగారింటి వద్ద ఉన్న శిరీష వద్దకు బుధవారం మహేష్ వెళ్లి గొడవ చేసి శిరీషపై, తన పెద్ద కుమారుడిపై డీజిల్ చల్లగా స్థానికులు మహేష్‌ను అక్కడి నుండి పంపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

నెహ్రూసెంటర్ : రెండో ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించి రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ రెండో ఏఎన్ఎం యూనియన్ నాయకులు అశ్విని, పద్మావతి పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. రేషపల్లి నవీన్, సరవిత, విజయ, పద్మ, లలిత, స్వరూపరాణి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రెండో ఏఎన్ఎంలు

11శాతం రిజర్వేషన్లు కల్పించాలి



నెహ్రూసెంటర్ : ఎస్సీ వర్గీకరణలో భాగంగా మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య మాదిగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పులి శ్రీను, రాధ, సుధా, ఉపేందర్, బాలరాజు, బాలకృష్ణ, శ్రీను, రాజు, సతీష్, రాజు, సంధ్య పాల్గొన్నారు.

కుల వివక్షపై అధికారుల విచారణ



జయపురంలో విచారణ చేస్తున్న తహసీల్దార్ నాగరాజు, ఎస్సై సురేష్

నర్సింహులపేట : మండలంలోని జయపురంలో అగ్రకులాల వారు తమపై వివక్ష చూపుతున్నారని దళితులు ఫిర్యాదు చేయగా గురువారం తహసీల్దార్ నాగరాజు, ఎస్సై మాలోత్ సురేష్ విచారణ చేపట్టారు. గ్రామంలోని అగ్ర కులానికి చెందిన వ్యక్తి సీతారాముల ఆలయానికి దళితులు రంగులు వేయవద్దని, ఆలయంలోకి రావొద్దని కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. ఈమేరకు గ్రామస్తుల సమక్షంలో అధికారులు విచారణ చేపట్టారు. దళితులపై కుల వివక్ష పాటిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళితులను ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. అందరు ఐక్యతతో, స్నేహభావంతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలి'

మహబూబాబాద్ అర్బన్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని గెలిపించాలని టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో ఏర్పాటు చేసిన సమావేశానికి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, రమేశ్, మల్లారెడ్డి, కవిత, యాకూబ్, శ్రీశైలం, మంజుల, వెంకటేశ్వర్లు, ఉపేందర్, హుస్సేన్, సంజీవ, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మిర్చి ఏరేందుకు వచ్చి.. మృత్యువాత

వ్యవసాయ బావిలో పడి మధ్యప్రదేశ్ వాసి మృతి

- స్వరాష్ట్రానికి తీసుకెళ్లే స్థోమతలేక ఇక్కడే అంత్యక్రియలు



నితేష్ మృతదేహం

మరిపెడ రూరల్ : మిర్చి ఏరేందుకు కూలీకి వచ్చి ప్రమాదవశాత్తు బావిలో పడి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నితేష్ (19) మృతిచెందిన సంఘటన మండలంలోని లూనావత్‌తండా శివారులో గురువారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని కాన్వడా జిల్లా భగ్‌వాన్‌పుర గ్రామానికి చెందిన 20 కుటుంబాలు మిర్చి ఏరేందుకు ఇటీవల మరిపెడకు వలస వచ్చారు. ఈ క్రమంలో మిర్చి ఏరడానికి లూనావత్ తండాకు బుధవారం చేరుకొని అక్కడ డేరాలు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన నితేష్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. దీంతో సంఘటన స్థలానికి మరిపెడ పోలీసులు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య హమ్రాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే మృతదేహన్ని స్వరాష్ట్రానికి తీసుకెళ్లే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇక్కడే అంత్యక్రియలు చేస్తామని మృతుడి బంధువులు తెలిపారు.



దీనంగా చూస్తున్న మృతుడి భార్య హమ్రాణి

రైలునుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

కేసముద్రం : రైలునుంచి జారిపడి ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన కోగిల అరవింద్, ఖమ్మంలోని ఓ కాలేజీలో డీ ఫార్మసీ చదువుతున్నాడు. ఈ మేరకు వరంగల్‌కు వెళ్లేందుకు, అతడు ఖమ్మంలో శాతావాహన ఎక్స్‌ప్రెస్ రైలెక్కాడు. ఈ క్రమంలో ఇంటికన్నె రైల్వే స్టేషన్ సమీపంలో అప్‌లైన్‌లో వెళ్లే ఆ రైలునుంచి అరవింద్ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతడి ఎడమకాలు తెగిపోగా, కుడికాలు పాదం, ఎడమ చేయి వేళ్లు తెగిపోయాయి. తీవ్రంగా గాయపడి ప్రాణాపాయస్థితిలో పడిఉన్న అతడిని 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



క్షతగాత్రుడు అరవింద్

గుడుంబా స్థావరాలపై దాడులు

డోర్నకల్/మహబూబాబాద్ రూరల్ : డోర్నకల్ మండలంలోని హూన్యా తండా, బోడ హట్యా తండాల్లోని గుడుంబా స్థావరాలపై గురువారం మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 2 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం చేసుకుని వేయి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. పది మందిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అలాగే మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 50 కిలోల నల్ల బెల్లం పట్టుబడగా ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి గురువారం తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు జి.చంద్రశేఖర్, అశోక్, ఆర్ కిరీటి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

కేసముద్రం : ఇనుగుర్తి మండలంలోని లాలు తండా, శివరాం తండాల్లో కేసముద్రం పోలీసులు, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో, 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారా, 20 కేజీల బెల్లం, 2 కేజీల పటికను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు గూడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపారు. ఎస్సై మురళీధర్‌రాజు, గూడూరు ఎక్సైజ్ శాఖ ఎస్సై రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.



డోర్నకల్: సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

నియామకం



వెంకట్రావు

డోర్నకల్ : టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పగిడిపాల వెంకట్రావు గురువారం నియామకం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం డీఐఈఓ మదార్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం డీఐఈఓను అధ్యాపకులు సన్మానించారు. సంఘం రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యక్షుడు రవీందర్, మహిళా కార్యదర్శి సుశీల, సభ్యులు శ్రీనివాస్, ఆండాలు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో ధ్వజారోహణం

డోర్నకల్ : స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లోని వేంకటేశ్వరాలయంలో 18వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ధ్వజారోహణంతో పాటు గరుడుబలి, సాయంత్రం భేరీతాడనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పరామర్శ

డోర్నకల్ : తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న డోర్నకల్ కాంగ్రెస్ నాయకుడు రెడ్డెబోయిన శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ గురువారం పరామర్శించారు. చికిత్స పొందుతున్న శ్రీను పరిస్థితిని సమీక్షించి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు

తొర్రూరు : అమరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కర్నాటి యాదగిరి మృతికి సంతాపంగా గురువారం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్‌సెంటర్‌లో నివాళులర్పించారు.

నులి పురుగుల నివారణే ధ్యేయం

గూడూరు : నులి పురుగుల నివారణే ధ్యేయంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ అవగాహన సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఐకేపీ, విద్యా, ఐసీడీఎస్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నెల 10వ తేదీన నులి పురుగుల నివారణకు 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకి ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శ్వేత, డాక్టర్ యమున, ఎంపీడీఓ వీరస్వామి, ఎంఈఓ రవీందర్, తీగల వేణి డాక్టర్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి: మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్

మహబూబాబాద్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్, ఎంపీడీఓ రఘుపతి రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఆయా శాఖల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో వైద్యులు సుధీర్, మౌనిక, సీహెచ్ఓ గోవర్ధన్, హెచ్ఈఓలు నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెల్లికుదురు : నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీఓ డి.బాలరాజు ఐసీడీఎస్, వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో మండల వైద్యాధికారులు శారద, రమ్య, ఐసీడీఎస్ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గార్ల: సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

చిన్నగూడూరు: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉగ్గంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ రామారావు, ఎంఈఓ రవికుమార్, సీహెచ్ఓ వలీఉద్దీన్, పంచాయతీ సెక్రటరీలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగర : మండల కేంద్రంలోని రైతు వేదికలో విద్య, వైద్యాధికారులు, ఐసీడీఎస్‌లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఎంపీడీఓ వేణుమాధవ్ కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ మహేందర్, పల్లె దవాఖాన వైద్యాధికారులు మహిపాల్, సభిత, హరిప్రియ, ఏఎన్ఎంలు హరిత, బూబా, అంగన్‌వాడీ టీచర్లు, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

గార్ల : ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ముల్కనూరు పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ మంగమ్మ, ఎంఈఓ ఎం వీరభద్రం, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బియ్యం అందజేత

కురవి : సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామానికి చెందిన సన్నాయిల రాంబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మలిశెట్టి వేణు గురువారం 50 కేజీల బియ్యం అందజేశారు. పగడాల కృష్ణారెడ్డి, చిప్పరపల్లి వెంకన్న, రాయభారపు వినయ్, సైదులు, కొమ్ము శ్రీను పాల్గొన్నారు.

ఉద్యమకారులకే టికెట్లు కేటాయించాలి



మహబూబాబాద్ రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకే టికెట్లు కేటాయించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డికి ఉద్యమకారులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఉద్యమకారులకు గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు నారాయణ్ సింగ్, సోమారపు వీరస్వామి, గుంజె హన్మంతు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నీరుటి లక్ష్మీనారాయణ, గండ్రాతి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వాలి

దంతాలపల్లి : గీతకార్మికులకు ద్విచక్ర వాహనాలు, సేఫ్టీ మోకులు అందించాలని గీత కార్మిక మండల సంఘం సభ్యులు కోరారు. గురువారం మండల కేంద్రంలో కేజీకేఎస్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీతకార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిన్న రాములు మాట్లాడారు. ఈ నెల 19న మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నాయకులు గుండగాని లింగయ్య, కొత్త అంతయ్య, కొత్త కొమురెల్లి, చీకటి ఉప్పలయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

కేసముద్రం : ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామంలో పోలీసులు గురువారం సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మురళీధర్‌రాజు మాట్లాడుతూ..సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చదువుపై శ్రద్ధ వహించాలి

నెల్లికుదురు : విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్సై చిర్ర రమేశ్ బాబు సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్నాక్స్ అందజేత

మహబూబాబాద్ అర్బన్ : పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉడకబెట్టిన పల్లీలు అందజేశారు. విద్యార్థులు ఆకలిపై ఆసక్తి కనబరచకుండా చదువుతున్నారని తెలిపారు.

అండర్ బ్రిడ్జి ప్రాంతంలో మరమ్మతులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని అనంతారం రోడ్డులో గల అండర్ బ్రిడ్జి ప్రాంతంలో నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తగా స్థానికులు ఎంపీ పోరిక బలరాంనాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఎంపీ నీరు నిల్వకుండా మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. గురువారం మున్సిపల్ డీఈ చిప్ప ఉపేందర్, రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలుస్తున్న ప్రాంతంలో ముళ్లకంచెలు తొలగించి, పైపులైన్ వేసి దారి మళ్లించారు.



మరమ్మతులు చేయిస్తున్న డీఈ ఉపేందర్